'తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు' అనే భర్తృహరి పద్యాన్ని ఇసుకాసురులు కంఠతా పట్టినట్టున్నారు. ఈ ఫొటోలో కనపడుతున్న దృశ్యం చూడండి.. చుట్టూ పెద్ద పెద్ద రాళ్లు.. మధ్యలో కాసింత దొడ్డు ఇసుక.. ఇంకేముందు ఇసుకైతే చాలు.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు అక్రమార్కులు. నిర్మల్, జగిత్యాల జిల్లాల సరిహద్దుగా ఉన్న గోదావరిలో అక్రమంగా సాగుతున్న ఇసుక వ్యాపారానికి మచ్చుతునక ఈ దృశ్యం. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట సమీపంలో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నప్పుడు తీసిన ఫొటో ఇది.



గూగుల్ మ్యాప్స్‌లో నిక్షిప్తమైన నిర్మల్ జిల్లా వైపున గోదావరి నదిలోని ఇసుక ర్యాంప్, ట్రాక్టర్లు

రాళ్లను వడబోసి.. ఇసుకను తరలించి!

ఇసుకాసురుల నయా దందా • రాళ్లు, రప్పల మధ్య నుంచీ తరలింపు • నిర్మల్, జగిత్యాల జిల్లాల మధ్య వెలికితీత

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): సాధారణంగా ఇసుక మేటలు వేసిన ప్రాంతాల్లో మాత్రమే ఇసుక వ్యాపారం సాగుతుంటుంది. అక్రమంగా ఇసుక తరలింపు కూడా అక్కడే కొనసాగుతుంది. కానీ, ఇప్పుడు ఇసుకాసురులు కొత్త పుంతలు తొక్కారు. అసలు ఇసుకే కనపడని ప్రాంతాల్లోనూ రాళ్లను వడపోసి మరీ ఇసుకను తరలిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నుంచి మొదలుకొని.. ధర్మపురి వరకు ఇసుక మేటలనేవి దాదాపుగా కనిపించవు. భారీగా రాళ్లు, రప్పలు, శిలలతో గోదావరి దర్శనమిస్తుంది. అక్కడక్కడా నల్లటి ఇసుక స్వల్పంగా ఉంటుంది. ఇప్పటివరకు ఈ ఇసుకకు డిమాండ్ ఉండేది కాదు. అయితే, ఇప్పుడు ఈ నల్లని దొడ్డు ఇసుకను కూడా అక్రమార్కులు తమకు అనుకూలంగా మలుచుకుని కాసులు దండుకుంటున్నారు.

గోదావరికి అటూ.. ఇటూ..

నదిలో రాళ్లలా ఉన్న ఇసుకను సైతం అక్రమార్కులు దారులు వెతికిమరీ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ధర్మపురి వరకు గోదావరి నది మొత్తం రాళ్లు, రప్పలతోనే కనపడుతుంది. అలా రాళ్లు, రప్పలుగా ఉండే గోదావరిలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, కోమటి కొండాపూర్, వేములకుర్తి, మల్లాపూర్ మండలం మొగిలిపేట, వేంపెల్లి వెంకట్రావ్‌పేట, బోర్నపల్లి నుంచి మొదలుకుని.. ధర్మపురి పుణ్యక్షేత్రం వరకు ఇటు జగిత్యాల జిల్లా వైపు.. అటు నిర్మల్, మంచిర్యాల (పాత ఆదిలాబాద్) జిల్లాల వైపు నుంచి బాదనకుర్తి, ఖానాపూర్, చింతల్‌చాంద, చిట్యాల్, బెల్లాల్, భూత్కూర్ వద్ద కడెం-గోదావరి నదులు కలిసే చోట ఇసుక తరలింపు భారీగా సాగుతున్నది. ఏకంగా కడెం పాయను దాటడానికి మట్టి రోడ్డును వేసుకుని మరీ అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుండటం గమనార్హం.

ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల వరకు..

ఇండ్ల పునాది, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి దొడ్డు ఇసుకను వాడుతుండటంతో అక్రమార్కుల దృష్టి రాళ్లు, రప్పలతో ఉండే గోదావరిపై పడింది. ఇంకేం కొత్త కొత్త దారులు కనుక్కుంటూ.. ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్ ఇసుక రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ రూ.లక్షల్లో దండుకుంటున్నారు. దందాలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారుల పాత్రకూడా ఉన్నట్టు సమాచారం. స్థానికంగా ఉండే నేతలకు సహకరిస్తూ.. ఇసుక దందాను చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారని స్థానికులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఇసుకాసురులకు అధికారుల సహకారం అనేది 'మామూలే' అని కూడా అంటున్నారు. ఈ వ్యవహారాన్ని తెరవెనుక నుంచి నడిపిస్తున్నది అధికార పక్షానికి చెందిన స్థానిక నేతలనే ఆరోపణలు వినపడుతున్నాయి. పైగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికార పార్టీలో చేరినట్టుగా ప్రకటించుకున్న ఇసుకాసురులు అధికారుల నుంచి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నారు. స్థానిక వార్డు సభ్యులు, సర్పంచ్ (ప్రస్తుతం మాజీలు), ఎంపీటీసీలు సైతం పార్టీలు మారడం వెనుక ఈ ఇసుకాసురుల 'హస్తం' కూడా ఉన్నదని అంటున్నారు. తద్వారా అక్రమ ఇసుక తరలింపు వ్యాపారం మూడు ట్రాక్టర్లు.. ఆరు ట్రిప్పులుగా సాగుతున్నది. రాళ్లు రప్పల మధ్య ఉన్న ఇసుకను సైతం తమ వ్యాపారానికి అనుగుణంగా మలుచుకుంటూ.. గోదావరి నదిని లూటీ చేస్తున్నారు.

అక్రమ తరలింపు గూగుల్‌లో నిక్షిప్తం

నిర్మల్, జగిత్యాల జిల్లాల సరిహద్దులోని గోదావరిలో సాగుతున్న ఇసుక అక్రమ వ్యాపారం తాలూకు సజీవ సాక్ష్యాలు గూగుల్‌లో నిక్షిప్తం అవుతున్నాయి. గూగుల్‌లో 'నమస్తే తెలంగాణ' పరిశీలించగా.. నదికి ఇరువైపులా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నట్టు కనపడుతున్నది. ఇసుక రవాణా కోసం గోదావరిలో ఏర్పాటు చేసుకున్న దారులుకూడా స్పష్టంగా కనపడుతున్నాయి. నిర్మల్ జిల్లా వైపున కడెం-గోదావరి నదులు కలిసే చోట ఏర్పాటుచేసిన మట్టిరోడ్డు.. వాటిపై ట్రాక్టర్ల ఆనవాళ్లుకూడా గూగుల్ మ్యాపుల్లో స్పష్టంగా చూడొచ్చు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్టుగా, అసలు ఇసుక అక్రమ రవాణాయే జరగనట్టుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

వర్ధన్నపేట మండలం కొత్తపల్లిలో మామిడి తోట వరకు ఇసుక తవ్విన దృశ్యం

ఆకేరు నుంచి ఇసుక అక్రమ రవాణా

ధ్వంసమవుతున్న పంట పొలాలు • పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 21 : అక్రమార్కులకు ఆకేరువాగు ఇసుక.. కాసుల పంటను కురిపిస్తున్నది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా యథేచ్ఛగా నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లలో వరంగల్ నగరానికి ఇసుక రవాణా జరుగుతూనే ఉన్నది. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై తెల్లవారుజామున వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలుతున్నది. ఇసుక తీయవద్దని గతంలోనే ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తెచ్చినా అక్రమార్కులకు అవేమీ పట్టడం లేదు. పచ్చని పంట పొలాలు, తోటలను ధ్వంసం చేస్తూ వాగు పరీవాహక ప్రాంతంలోని పంట భూముల్లో ఇసుకను తీసి తరలిస్తున్నారు. ఈ దందా దర్జాగా సాగుతున్నా పాలకులు, అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

అయ్యవారిపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు, గ్రామస్థులకు సర్దిచెప్తున్న పోలీసులు

ఇసుక అనుమతులు రద్దు చేయాలి

- **అయ్యవారిపల్లి గ్రామస్థుల ధర్నా**

మిడ్జిల్, ఫిబ్రవరి 21: సీజ్ చేసిన ఇసుక తరలింపు అనుమతులను రద్దు చేయాలని రైతులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లిలో 'మన ఊరు-మన ఇసుక' అంటూ సుమారు 100 మంది రైతులు, గ్రామస్థులు ర్యాలీ చేపట్టి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో దుందుభి, ఇతర వాగుల నుంచి సేకరించి అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో డంప్ చేసిన ఇసుకను సీజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వ పనులకు ఇసుకను వినియోగించాలని జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారని, అయితే.. ఆ అనుమతులు రద్దు చేసి గ్రామంలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం తెలుసుకున్న సీఐ నాగార్జున, ఎస్సై ఆనంద్ అక్కడికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దీంతో స్థానికులు శాంతించారు. ఇసుక క్వారీ కాంట్రాక్టర్లకు, స్థానికులకు రెండు, మూడ్రోజులుగా తరలింపు విషయంలో వాగ్వాదం నడుస్తున్నది.

ఇరిగేషన్ ఈఎన్సీ జనరల్‌గా అనిల్‌కుమార్

పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం

- **ఇంటర్ స్టేట్ వ్యవహారాలు ఈఎన్సీ నాగేందర్‌రావుకు**
- **సీఈ చంద్రశేఖర్‌కు మైనర్ ఇరిగేషన్, ఐడీసీ బాధ్యతలు**

అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, చంద్రశేఖర్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాగునీటి పారుదల శాఖ ఈఎన్సీ (జనరల్)గా ఈఎన్సీ (అడ్మినిస్ట్రేషన్) అనిల్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ మురళీధర్ రాజీనామా అనంతరం ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించని ప్రభుత్వం.. రెగ్యులర్ ఈఎన్సీ (జనరల్)ని నియమించే వరకూ ఈఎన్సీ (అడ్మినిస్ట్రేషన్) అనిల్‌కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించింది. అదేవిధంగా ఈఎన్సీ జనరల్‌కు సంబంధించిన పలు బాధ్యతలను మరో ఇద్దరు అధికారులను కేటాయించింది. స్టేట్‌లెవల్ స్టాండింగ్ కమిటీ, ఐబీఎం కమిటీ, స్టేట్ లెవల్ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ, స్కివమ్, ఓఅండ్‌ఎం కమిటీ చైర్మన్‌గా, కమిషనర్ ఆఫ్ టెండర్స్‌గా, బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజినీర్స్, కాళేశ్వరం కార్పొరేషన్, జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్, మూసీ రివర్ ఫ్రంట్, జీఆర్‌ఎంబీ, కేఆర్‌ఎంబీ, తుంగభద్ర బోర్డుల మెంబర్ తదితర బాధ్యతలను ఈఎన్సీ అనిల్‌కుమార్‌కు అప్పగించింది.

నాగేందర్‌రావుకు ఇంటర్ స్టేట్ వ్యవహారాలు

అంతర్‌రాష్ట్ర జలవివాదాలు, ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు, నీటి కేటాయింపుల అంశంపై కేంద్రంతో సంప్రదించే బాధ్యతలతోపాటు, హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్ యాక్టివిటీలను ఈఎన్సీ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) నాగేందర్‌రావుకు ప్రభుత్వం అప్పగించింది. మైనర్ ఇరిగేషన్, ఐడీసీ లిఫ్టులు, కాడా, కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పనుల బాధ్యతలను చీఫ్ ఇంజినీర్ కేఎస్ఎస్ చంద్రశేఖర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కృష్ణాజలాలపై సోయిలేని సర్కారు

- **ట్రిబ్యునల్ విధించిన గడువు ముగిసినా**
- **ఇప్పటికీ ఎస్‌వోసీ దాఖలు చేయని వైనం**
- **వచ్చే నెలలో ప్రారంభం కానున్న వాదనలు**
- **సెలవులో సీఈ మోహన్‌కుమార్..**
- **శంకర్‌నాయక్‌కు బాధ్యతల అప్పగింత**
- **డైలమాలో పడిన న్యాయవాదులు**
- **కీలకాంశాలను గాలికొదిలేసిన సర్కారు**

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): కృష్ణాజలాల్లో న్యాయమైన వాటాను సాధించే అంశంపై ప్రభుత్వానికి సోయి లేకుండా పోయింది. రాజకీయాలే పరమావధిగా శ్వేతపత్రాలను విడుదల చేస్తూ, ప్రాజెక్టుల చుట్టూ తిరుగుతున్నదే తప్ప కీలకమైన ట్రిబ్యునల్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి సారించలేదు. వచ్చే నెల నుంచే వాదనలు ప్రారంభం కావాల్సి ఉండగా.. అందుకు సంబంధించిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)ను దాఖలు చేయలేదు. రేవంత్ సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేక ఇంటర్ స్టేట్ విభాగం అధికారులు ఏంచేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

సుదీర్ఘ పోరాటంతో ట్రిబ్యునల్

కరువు, వర్షపాతం లాంటి పరిస్థితులతోపాటు సాగుకు యోగ్యమైన భూములు, క్యాచ్‌మెంట్ ఏరియా విస్తీర్ణం తదితర అంశాల వారీగా ట్రిబ్యునళ్లు నదీజలాల్లో వాటాలను కేటాయిస్తాయి. అందుకు విరుద్ధంగా కేవలం అప్పటికే వినియోగంలో ఉన్న కృష్ణా జలాలను మాత్రమే ఏపీ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా ఏపీ, తెలంగాణకు జలాలను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ, ఆ మార్గదర్శకాలతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్పష్టంచేసింది. అంతర్‌రాష్ట్ర జలవివాదాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం ట్రిబ్యునల్‌కు విచారణ చేసే అధికారం కల్పించాలని సుదీర్ఘ పోరాటం చేసింది. దీంతో దిగివచ్చిన కేంద్రం సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కృష్ణా జలవివాద ట్రిబ్యునల్-2కు గతేడాది అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీచేసింది. ఉమ్మడి ఏపీకి కేటాయించిన జలాలను ఇరు రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయాలని, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీల నీటి విషయాన్ని కూడా తేల్చాలని ట్రిబ్యునల్‌కు సిఫారసు చేసింది. దీంతో నూతన మార్గదర్శకాల ప్రకారం విచారణ చేపట్టేందుకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్-2 సిద్ధమైంది.

సోయిలేని సర్కారు

తెలంగాణకు అత్యంతకీలమైన కృష్ణాజలాల్లో న్యాయమైన వాటా సాధనన కోసం ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అంతర్‌రాష్ట్ర అంశాల్లో అనుభజ్ఞులైన, సమర్థులైన అధికారులు, సహాయకులను ఇంటర్ స్టేట్ విభాగంలో నియమించాలి. వారికి ఈఎన్సీ జనరల్ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తుండాలి. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితే లేకుండా పోయింది. శ్వేతపత్రం తయారీ, మేడిగడ్డ పర్యటనపై దృష్టిసారించినంతగా ఇంటర్ స్టేట్ విభాగంపై, ట్రిబ్యునల్ అంశంపై ఇప్పటికీ దృష్టి సారించలేదు. ఇంటర్ స్టేట్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మరోవైపు ఇంటర్ స్టేట్ విభాగం సీఈ మోహన్‌కుమార్ ఇటీవల నెలరోజుల సెలవుపై వెళ్లడంతో ప్రభుత్వం ఆ బాధ్యతలను ఈఎన్సీ జనరల్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న చీఫ్ ఇంజినీర్‌కు శంకర్‌నాయక్‌కు అప్పగించి చేతులు దులిపేసుకున్నది.

డైలమాలో న్యాయవాదులు

తెలంగాణ తరపున ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలను వినిపించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీనియర్ న్యాయవాదులు వైద్యనాథన్, రవీందర్‌రావు, నిఖిల్‌స్వామి తదితరులను నియమించింది. కానీ, ప్రస్తుత రేవంత్ సర్కారు తమను కొనసాగిస్తుందా? లేదా? అనే డైలమాలో పడిపోయిన ఆ న్యాయవాదులు విచారణకు సంబంధించిన అంశాలను పొందుపరచడానికి సంశయాన్ని వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వస్తే తప్ప ట్రిబ్యునల్‌కు సంబంధించిన అంశాలను ముట్టుకోకూడదనే భావనలో వారు ఉన్నట్టు తెలుస్తున్నది. అయినప్పటికీ అంతర్‌రాష్ట్ర జలవిభాగం అధికారులతో గానీ, న్యాయవాదులతో గానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సమావేశాన్ని నిర్వహించలేదు. దీంతో ఏం చేయాలో తెలియక అంతర్‌రాష్ట్ర జలవిభాగం అధికారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నేటికీ దాఖలు చేయని ఎస్‌వోసీ

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా దక్కాలంటే ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాల్సి ఉన్నది. కృష్ణా జలాల కేటాయింపులో గతంలో జరిగిన అన్యాయంతోపాటు న్యాయపరంగా ప్రస్తుతం ఎంత వాటా వస్తుంది? ఏ కారణంతో జలాలను కేటాయించాలి? అందుకు గల ఆవశ్యకతలు ఏమిటి? అనే విషయాలను సహేతుకంగా ట్రిబ్యునల్‌కు వివరించాల్సి ఉన్నది. దీనినే స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ) అంటారు. దీన్ని 6 నెలల్లోగా దాఖలు చేయాలని ట్రిబ్యునల్ గతేడాది నవంబర్‌లో ఇరు రాష్ట్రాలను ఆదేశించింది. ఈ గడువు ఈ నెల 14తోనే ముగిసింది. వచ్చే నెల 5, 6,7 తేదీల్లో ట్రిబ్యునల్ విచారణ కొనసాగనున్నది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఎస్‌వోసీని దాఖలు చేయలేదు.

విద్యుత్తు సమస్యలపై సకాలంలో స్పందించాలి

డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి21 (నమస్తే తెలంగాణ): వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్తు సమస్యలపై సకాలంలో స్పందించాలని డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కాల్‌సెంటర్‌ను బలోపేతం చేయాలని, వినియోగదారుల నుంచి వచ్చే ప్రతి కాల్‌ను రికార్డు చేసి, ఆ ఫిర్యాదులకు ఏ పరిష్కారం చూపారో ఎప్పటికప్పుడు తెలపాలని పేర్కొన్నారు. వచ్చే వేసవిలో విద్యుత్తు సరఫరా ఏర్పాట్లపై సీఎండీ రిజ్వీతో కలిసి ట్రాన్స్‌కో ఎస్ఈలతో సచివాలయం నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు, వ్యాపారులు సహా వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్తును సంపూర్ణంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. అసత్యాలు ప్రచారం చేసే వారిపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఇబ్బందులను సీఎండీకి ఆ తర్వాత తనకు తెలపాలని ఆదేశించారు. సమావేశంలో దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఉత్తర డిస్కమ్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ మరమ్మతులపై ఏపీ అభ్యంతరం

తెలంగాణపై కేఆర్ఎంబీకి ఫిర్యాదు • నేడు సాగర్‌కు బోర్డు అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ డ్యామ్‌పై చేపట్టిన పలు మరమ్మతు పనులపై ఏపీ సర్కారు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు తాజాగా కేఆర్ఎంబీకి లేఖ రాసింది. దీంతో కేఆర్ఎంబీ అధికారులు గురువారం ఆ మరమ్మతు పనులను పరిశీలించనున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం, శ్రీశైలం డ్యామ్ నిర్వహణను ఏపీ సర్కారు చూడాల్సి ఉన్నది. రాష్ట్ర పునర్విభజన నాటి నుంచే ఈ విధానం కొనసాగుతున్నది. దీనికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గతంలో రూ.20 కోట్లతో సాగర్ డ్యామ్‌కు పలు మరమ్మతులు చేపట్టింది. ప్రధానంగా గేట్ల రబ్బర్‌సీల్స్‌ను మార్చడం, గ్రీజింగ్, రోప్‌ల మార్పిడితోపాటు, గ్యాంట్రీ పట్టాల మార్పిడి, గ్యాలరీ తదితర పనులను నిర్వహిస్తున్నది. ఈ పనులు కొనసాగుతుండగానే ఏపీలోని జగన్ ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందురోజు సాయుధబలగాలతో తరలివచ్చి డ్యామ్‌ను కుడివైపు 13వ గేట్‌వరకు, కుడి కాలువ రెగ్యులేటర్‌ను ఆక్రమించడం.. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని అక్కడ సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాగర్ డ్యామ్‌ను కేఆర్ఎంబీ తన ఆధీనంలోకి తీసుకున్నది. అంతేకాకుండా డ్యామ్‌కు ఎలాంటి మరమ్మతులు చేపట్టాలన్నా, ఇరు రాష్ట్రాల అధికారులను డ్యామ్ వద్దకు అనుమతించాలన్నా కేఆర్ఎంబీ అనుమతి తప్పనిసరని, అనుమతులు ఉంటేనే అధికారులను అనుమతించాలని సీఆర్పీఎఫ్‌కు కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో డ్యామ్ మరమ్మతు పనులకు అనుమతివ్వాలని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కేఆర్ఎంబీని కోరింది. అందుకు బోర్డు అనుమతి ఇవ్వడంతో తెలంగాణ ప్రభుత్వం డ్యామ్ మరమ్మతు పనులను పునఃప్రారంభించింది. ఏపీ వైపున కూడా మరమ్మతు పనులను చేపట్టింది. అయితే ఆ పనులపై తాజాగా ఏపీ సర్కారు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ పనులను ఎందుకు చేస్తున్నారు? అవి అత్యవసరమైన పనులా? కావా? అని ప్రశ్నిస్తూ కేఆర్ఎంబీకి లేఖ రాసింది. ఏపీ అభ్యంతరాల నేపథ్యంలో డ్యామ్ మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో సందర్శించేందుకు బోర్డు సిద్ధమైంది. అందుకోసం ఇద్దరు అధికారులను నియమించింది. వారు గురువారం డ్యామ్‌ను సందర్శించనున్నారు.

లోకం పోకడ

చికెన్ కోసం తీసుకుపోయిన డబ్బులు వెల్లుల్లికే సరిపోయాయి.. ఏం చేస్తాం.. వెల్లుల్లి బిర్యానీ చేయి!

కాళేశ్వరం కార్పొరేషన్ చైర్మన్‌గా రాహుల్ బొజ్జా

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీసీఎల్) చైర్మన్‌గా ఇరిగేషన్ శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కాళేశ్వరం నిర్మాణానికి కావాల్సిన నిధుల సమీకరణకు తెలంగాణ ప్రభుత్వం కేపీసీఎల్‌ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కార్పొరేషన్ చైర్మన్‌గా ఇరిగేషన్ శాఖ సెక్రటరీ వ్యవహరించాల్సి ఉన్నది. గత చైర్మన్ రజత్‌కుమార్ నవంబర్‌లో ఉద్యోగ విమరణ పొందారు. నాటి నుంచి చైర్మన్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో ప్రస్తుత ఇరిగేషన్ శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జాను ఆ పోస్టులో నియమించింది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	15.3°c	37.6°c
రంగారెడ్డి	15.5°c	36.8°c
మెదక్	17.9°c	37.0°c
హైదరాబాద్	19.0°c	34.0°c
నల్లగొండ	20.2°c	37.5°c
నిజామాబాద్	20.3°c	36.2°c
ఖమ్మం	21.0°c	37.0°c
వరంగల్	21.0°c	34.0°c
కరీంనగర్	21.0°c	35.0°c
మహబూబ్‌నగర్	21.2°c	35.5°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌టీపీసీలో...

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 110
- **పోస్టులు:** డిప్యూటీ మేనేజర్
- **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, సీ అండ్ ఐ, సివిల్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 8
- **వెబ్‌సైట్:** www.ntpc.co.in

ఐటీడీసీఎల్‌లో...

ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐటీడీసీఎల్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 22
- **పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్, చెఫ్, అసిస్టెంట్ లెక్చరర్స్
- **విభాగాలు:** ఈవెంట్స్, హెచ్‌వో, లీగల్, సివిల్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 14
- **వెబ్‌సైట్:** www.itdc.co.in

బెల్‌లో..

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 47
- **పోస్టులు:** ట్రెయినీ ఇంజినీర్
- **విభాగాలు:** సీఎస్ఈ, ఐటీ
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 7
- **వెబ్‌సైట్:** www.bel-india.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ ఎస్సే (గ్రూప్-1), పాలిటీ, భారత దేశ చరిత్ర (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.